సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



ప్రజా సమస్యలపై గళమెత్తుతా
పార్లమెంట్‌కు పంపితే ప్రజా సమస్యలపై గళమెత్తుతానని భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్ పేర్కొన్నారు.
- 8లో



నిబంధనలు బేఖాతర్
భువనగిరి పట్టణంలో తైబజార్ వసూళ్లలో నిర్వాహకులు నిబంధనలు గాలికొదులుతున్నారు.
- 9లో

గరిష్టం / కనిష్టం
42^{0} / 27^{0}

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

భువనగిరి : మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, బీసీ,ఎస్సీ,ఎస్టీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 5 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 ప్రవేశ పరీక్ష జరిగింది. జూనియర్ కళాశాలలో ప్రవేశ పరీక్షకు 921 మంది విద్యార్థులకు గాను 790 మంది హాజరయ్యారు. 131 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ కోసం 296 మంది విద్యార్థులకు 259 మంది హాజరయ్యారు. 37 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



రామన్నపేటలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షత్రిమయుమ్ తెలిపారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణంలో 34,35,36, బోగారంలోని 18, 19 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ రోజు ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయనవెంట తహసీల్దార్ లాల్ బహదూర్, ఎస్‌ఐ మల్లయ్య, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు



రికార్డులను పరిశీలిస్తున్న పౌరసరఫరాల, ఐకేపీ అధికారులు

భువనగిరిరూరల్ : మండలంలోని బొల్లేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ డీపీఎం సునీల్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ఏగ్రేడ్‌గా నిర్ధారించి మిల్లుకు పంపిన ధాన్యం నాణ్యతలో తేడా ఉందని వ్యవసాయ అధికారులకు ఇటీవల మిల్లర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పౌరసరఫరాలు, ఐకేపీ అధికారులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఏగ్రేడ్ ధాన్యాన్ని తిరిగి సాధారణ రకంగా నిర్ధారించినట్లు రైతులకు తెలియజేశారు. సాంకేతిక సిబ్బంది కూడా ధాన్యం శాంపిల్స్ సేకరించి బీగ్రేడ్‌గా నిర్ధారించినట్లు చెప్పారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

సనాతన ధర్మంలో నారీశక్తికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న సునీతారాంమోహన్‌రెడ్డి

భువనగిరి : మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతారాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపే సత్తా మహిళా శక్తికే ఉంటుందన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని వైఎస్సార్ గార్డెన్‌లో వీహెచ్‌పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాతృశక్తి దుర్గావాహిని ఒక రోజు అభ్యసన వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న మాతృశక్తి దుర్గావాహిని పనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలు సూచించారు. తెలంగాణ ప్రాంత సనాతన ధర్మంలో నారీశక్తికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. బొక్క అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రాంత సహ సంయోజక అరుంధతి, శ్రీవాణి, నల్లగొండ విభాగ సంయోజక జ్యోతి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్వి లావణ్య, సత్యలక్ష్మి, పొత్నక్ రాఘవేందర్, తోట భానుప్రసాద్, సుక్కల శ్రీశైలం, చామ రవీందర్, వేణు, భరత్, శివ, నవీన్, పూస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండిన సన్ డే

సమోదైన ఉష్ణోగ్రతలు

మర్యాల	బుజిలాపురం	వలిగొండ	వెంకిర్యాల	చౌటుప్పల్	రాజాపేట	యాదగిరిగుట్ట
44.4 డిగ్రీలు	43.9	43.7	43.6	43.5	43.4	43.1



నిర్మానుష్యంగా వలిగొండ - నల్లగొండ రోడ్డు

భువనగిరిటౌన్ : ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగ మండిపోతున్నాడు. మధ్యాహ్నం సమయానికి తన ప్రతాపం చూపుతున్నాడు. జిల్లాలో ఆదివారం అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. ఉదయం 11 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.ఎండ తీవ్రతకు వడగాలులు, ఉక్కపోత తోడవడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నారాయణపురం	రామన్నపేట	భువనగిరి	గుండాల	కొలనుపాక	అడ్డగూడూరు	ఆత్మకూర్
42.7 డిగ్రీలు	42.7	42.6	42.4	42.1	42.1	42.0

ఎన్నికల వేళ.. ఎక్సైజ్ నిఘా

ముమ్మరంగా తనిఖీలు, రూట్‌వాచ్‌లు
- మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా
- ఏరోజుకారోజు స్టాక్ వివరాల సేకరణ
- అధిక మొత్తంలో లిక్కర్ కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలు ఆరా
- సారా తయారీ కేంద్రాలపై దాడులు
- 42 రోజుల్లో 401 కేసులు నమోదు



నారాయణపురం మండలంలోని ఓ తండాలో బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం : ఎన్నికల వేళ ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు, గుడుంబాపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా ఆశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా840 చోట్ల తనిఖీలు చేసి 401 కేసులు నమోదు చేశారు. 36 మందిని అదుపులోకి తీసుకున్నారు.41 మందిని బైండోవర్ చేశారు.

ఆకస్మిక తనిఖీలు, అనుమానిత ప్రాంతాల్లో రూట్‌వాచ్‌లు..

జిల్లాలో మోత్కూరు, భువనగిరి, రామన్నపేట, ఆలేరు ఎక్సైజ్ సర్కిళ్ల ఉన్నాయి. వీటి పరిధిలో అక్రమ మద్యం రవాణా జరగకుండా ఎక్సైజ్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు, అనుమానిత ప్రాంతాల్లో రూట్‌వాచ్‌లు నిర్వహిస్తున్నారు. వైన్స్‌లు, బార్లపైనా నిఘా పెట్టారు. రోజువారీ మద్యం అమ్మకాలు, స్టాక్ వివరాలను ఏరోజుకారోజు సేకరిస్తున్నారు. మద్యం అధిక మొత్తంలో తీసుకెళ్తున్నారా? తీసుకెళ్తే ఎవరు, ఎందుకు తీసుకెళ్తున్నారు? వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. బెల్టు దుకాణాలకు మద్యం అమ్మకాలపైనా దృష్టి సారించారు.

గుట్టుగా గుడుంబా తయారీ, రవాణా..

ఎన్నికల వేళ గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురంలోని తండాలు, మారుమూల ప్రాంతాల్లో సారా తయారీ ఘటనలు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి. తయారు చేసిన గుడుంబాను రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. కాగా గుడుంబా తయారీదారులు సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్‌లో పలు దుకాణాల నుంచి బెల్లం, పటిక కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది అక్రమార్కులు బెల్లం, పట్టిక ఇచ్చి సారా తయారు చేయిస్తున్నారు. గుడుంబాను వారే కొనుగోలు చేసి హైదరాబాద్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదంతా రాత్రి వేళల్లో జరిగిపోతుంది.

ముడి సరుకులు సరఫరా

కొందరు దళారులు గుడుంబా తయారీదారులకు మరీ ఫోన్ చేసి బెల్లం, పట్టిక విక్రయిస్తున్నట్లు సమాచారం. తయారీదారులు, దళారులు తరచూ ఫోన్ నంబర్లు మారుస్తుండడంతో వారిని పట్టుకోవడం ఎక్సైజ్ అధికారులు కష్టంగా మారింది. గుడుంబాను అటవీ ప్రాంతంలో తయారు చేస్తుండడం, ఎప్పటికప్పుడు స్థావరాలను మారుస్తుండడంతో పట్టుకోవడం ఎక్సైజ్ అధికారులకు సవాల్‌గా మారింది.

సంస్థాన్ నారాయణపురం మండలంపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మంది అధికారులు గుడుంబా స్థావరాలు, వైన్స్‌లు, బెల్టు షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని తండాలు, మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలోని ఇటీవల గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎనిమిది కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. 68 లీటర్ల గుడుంబా, 2,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 35 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు.



సంస్థాన్ నారాయణపురంలోని వైన్స్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ జిల్లా అధికారి (ఫైల్)

ముడి సరుకులు ఇస్తే కఠిన చర్యలు



ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారీ తయారీపై ప్రత్యేక దృష్టి సారించాం. గుడుంబా తయారీకి అవసరమైన ముడి సరుకులు సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నా, మద్యం డంపు చేసినట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. వైన్స్ షాపులపైనా నిఘా ఉంచాం. మద్యం విక్రయాలు, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం.

– శంకర్, ఎక్సైజ్ ఎస్‌ఐ, రామన్నపేట స్టేషన్

బీఆర్‌ఎస్ పార్టీ అవసరం ఏమాత్రం లేదు



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : ప్రస్తుతానికి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అవసరం ఏ మాత్రం లేదని, అందుకే అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఆరుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆదివారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ గూటికి చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల బతుకులు మారుతాయన్న ఆలోచనతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందన్నారు. కానీ, ప్రజల జీవితాలు అధ్వాన్నంగా మారగా కేసీఆర్ కుటుంబం మాత్రం రాజ బోగాలు అనుభవించిందని ధ్వజమెత్తారు. పదేళ్లు ఎదురుచూసిన ప్రజలకు నిరాశే ఎదురుకావడంతో కాంగ్రెస్ పార్టీని కోరి మరీ అధికారంలోకి తెచ్చుకున్నారని తెలిపారు. పేదల బతుకులు బాగుపడాలంటే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలవాలన్నారు. ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, అభివృద్ధికి అధిక నిధులు తీసుకువస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో కౌన్సిలర్లు ఎండీ బాబాషరీఫ్, బొడిగె అరుణబాల కృష్ణ, బండమీది మల్లేష్, కొరగోని లింగస్వామి, సుల్తాన్ రాజు, బత్తుల రాజ్యలక్ష్మి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు తాడూరి వెంకట్‌రెడ్డి, గుత్తా ఉమాదేవి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఉప్పు భద్ర య్య, కౌన్సిలర్ కొయ్యడ సైదులు, బ్లాక్, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ, బోయ దేవేందర్, నాయకులు పబ్బు రాజుగౌడ్, చెన్నగోని అంజయ్య, గుండు మల్లయ్య, దైద మోహన్‌రెడ్డి, బొబ్బిళ్ల మురళి, మొగుదాల రమేష్, ఎండీ హన్నుభాయ్, బొంగు జంగయ్య, ఊడుగు శ్రీనివాస్, పాశం సంజయ్‌బాబు, కొంతం భాస్కర్‌రెడ్డి, మాదగోని శేఖర్, పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఇంటింటికీ పోల్ చిట్టీలు

- నేరుగా ఓటర్లకు అందజేస్తున్న బీఎల్‌ఓలు
- మే 8వ తేదీ నాటికి పంపిణీ పూర్తి



పోల్ చిట్టీలు చూపుతున్న ఓటర్లు

భువనగిరిటౌన్ : లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా పోల్ చిట్టీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు నేరుగా పోల్ చిట్టీలు అందజేస్తున్నారు. మే 8వ తేదీలోపు పోల్ చిట్టీల పంపిణీ పూర్తయ్యేలా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది.

పోల్ చిట్టీ అందకపోతే 1950కు ఫోన్ చేయండి

ఎన్నికల్లో సులువుగా ఓటు వేసేందుకు పోల్ చిట్టీ దోహదపడనుంది. పోల్ చిట్టీలు అందని వారు ఆందోళన చెందవద్దని అధికారులు చెబుతున్నారు. తమ పరిధిలోని బీఎల్‌ఓను సంప్రదించాలని. వారు ఇవ్వనిపక్షంలో టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేసి వివరాలు తెలియజేసినట్లయితే పోలీ చిట్టీ అందజేస్తారు. లేకుంటే అండ్రాయిడ్ ఫోన్‌లో ఈఎస్‌ఈ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరు గుర్తింపు కార్డు నంబరు నమోదు చేసి 1950కు ఎస్‌ఎంఎస్ చేయాలి. కొద్ది సేపటికే ఫోన్‌కు పోల్ చీటీ లింక్ వస్తుంది.

చిట్టీపై సమగ్ర సమాచారం

పోల్ చిట్టీలపై ఓటరు పేరు, ఫొటో, చిరునామా, నియోజకవర్గం వివరాలు పొందుపరిచారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య ఆధారంగా చిట్టీలను ఎన్నికల సంఘం అందజేసింది. బీఎల్‌ఓలతో పాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సహకారంతో గడువులోపు చిట్టీల పంపిణీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఓటర్లపై ఒత్తిడి లేకుండా..

గతంలో రాజకీయ పార్టీలు ఓటర్లకు పోల్ చిట్టీలు ఇస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని ఒత్తిడి తీసుకొచ్చే పరిస్థితి ఉండేది. అయితే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత ఎన్నికల నుంచి బీఎల్‌ఓలు నేరుగా ఓటర్లకు పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. తద్వారా రాజకీయ పార్టీలు ఓటర్లను ఒత్తిడి గురి చేసే పరిస్థితి తక్కువగా ఉంటుంది.

భువనగిరి ఎంపీ స్థానంలో ఓటర్లు ఇలా..

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2,141 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లు 18,049,930 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 896219, మహిళలు 908632, ఇతరులు 79 మంది నమోదై ఉన్నారు. వీరందరికీ పోల్ చీటీలు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయిగిరిలో పోల్ చీటీల పంపిణీ తీరును కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్ పరిశీలించారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు సూచనలు చేశారు.



రాయగిరిలో పోల్ చిట్టీల పంపిణీని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

నారసింహుడికి నిత్యారాధనలు



స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. మేల్కొలుపులో భాగంగా స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఈ శ్రీస్వామి, అమ్మవారికి ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన, నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేంగించారు. ఈవేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

నేడు, రేపు టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు

భువనగిరి : అండర్–14 బాల, బాలికల జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు మే 1నుంచి 4వ తేదీ వరకు భువనగిరిలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 165 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. 29,30 తేదీల్లో జిల్లా జట్ల ఎంపికలు ఉంటాయని జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ తెలిపారు. క్రీడా పోటీల కోసం 8 మైదానాలు ఏర్పాటు చేశామని, ఇందులో నాలుగు మైదానాలు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు పాఠశాలలో వసతి సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు.

యాదాద్రిలో మరిన్ని సౌకర్యాలు

- ఇప్పటికే డార్మిటరీహాల్, టెంట్, ఏసీలు, కూలర్లు ఏర్పాటు
- త్వరలో మరికొన్ని అందుబాటులోకి
- ఈఓ భాస్కర్‌రావు చొరవతో మెరుగుపడుతున్న వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



శివాలయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై దేవస్థానం మరిన్ని వసతులు కల్పిస్తోంది. ఇప్పటికే కొన్ని అందుబాటులోకి రాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ప్రధానాలయ ఉద్ఘాటన జరిగి రెండేళ్లు గడిచినా సరైన సౌకర్యాలు సమకూరకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన ఈవోగా భాస్కర్‌రావు బాధ్యతలు స్వీకరించిన తరువాత పూర్తిస్థాయి వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఇప్పటికే డార్మిటరీ హాల్, నీడకోసం తాత్కాలిక టెంట్, క్యూలైన్‌లో ఏసీలు, నిత్యకల్యాణ మండపంలో కూలర్లు ఏర్పాటు చేశారు.

రూ.150 టికెట్ దర్శనం లైన్ మార్పు

గతంలో ధర్మదర్శనం మార్గంలోనే రూ.150 టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులను పంపేవారు. దీంతో రూ.150 టిక్కెట్‌పై వెళ్లే భక్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన బుకింగ్ కౌంటర్ నుంచి ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి పాత పీఆర్వో కార్యాలయం మీదుగా క్యూకాంప్లెక్ చివరి అంతస్తులోకి పంపిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా గోల్డ్ క్యూలైన్, తూర్పు ద్వారం గుండా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

ఎల్‌ఈడీ స్క్రీన్లు

శ్రీస్వామి, అమ్మవారికి నిర్వహించే పూజాది కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ మాడ వీధిలో తిరుమల తరహాలో ఎల్‌ఈడీలు రానున్నాయి.

అదనపు ప్రసాద విక్రయ కేంద్రం

ప్రస్తుతం ఉన్న ప్రసాదం కౌంటర్లకు అదనంగా మరో ప్రసాద విక్రయ కేంద్రాన్ని కొండపై ఏర్పాటు చేస్తున్నారు. స్వామి సన్నిధికి భక్తుల రాక గణనీయంగా పెరిగింది. లడ్డూ, పులిహోర ప్రసాదాలను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేకించి సెలవు రోజుల్లో ప్రసాదం కొనుగోలుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని శివాలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మరో ప్రసాద విక్రయం కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో ఇది భక్తులకు అందుబాటులోకి రానుంది.

సమాచార కేంద్రం..

దర్శన వేళలు, పూజల వివరాలు, టిక్కెట్ల ధరలు, ప్రధానాలయం, శివాలయం, ప్రసాద విక్రయశాలకు వెళ్లే వివరాలు తెలియక భక్తులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని భక్తులు ఈఓ భాస్కర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కొండపైన బస్టాండ్ వద్ద సమాచార కేంద్రం, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే అందుబాటులోకి రానుంది.



చిన్న పిల్లలకు పాలు ఇచ్చే గది



శ్రీస్వామివారి దర్శనం కోసం మహిళలు చంటి పిల్లలతో వస్తుంటారు. వీరి సౌకర్యార్థం పిల్లలకు పాలు ఇవ్వడానికి కొండపై ఆళ్వారుల ఉప ఆలయం వెనుక ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశారు. త్వరలో ప్రారంభించనున్నారు. ఈవో నిర్ణయంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘాట్ రోడ్డులో మైక్‌లు



భక్తులకు ఆధ్యాత్మికత, ఆహ్లాదం పంచేందుకు ప్రతి శుక్ర, శనివారాల్లో ఆలయ మాఢ వీధిలో కళాకారులతో భక్తీ సంగీతం, పాటలు, స్వామివారి కీర్తనలు, కూచిపూడి, భరత నాట్యం వంటి సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నారు. భక్తి పాటలు, శ్రీస్వామి కీర్తనలు, ఇతర సమాచారం భక్తులకు వినిపించేలా ఘాట్ రోడ్డులో మైక్‌లు ఏర్పాటు చేశారు.



ధర్మదర్శనం భక్తులకు ప్రత్యేక మార్గం

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

తనిఖీల్లో రూ.11 కోట్ల నగదు, మద్యం స్వాధీనం

● నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వాహనాల తనిఖీల్లో ఇప్పటివరకు రూ.11,07,41,000 నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట నిఘా పెంచామని, వాడపల్లి, అడవిదేవులపల్లి, నాగార్జున సాగర్‌లోని చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎన్‌హెచ్‌-65పై కేతేపల్లి టోల్‌ప్లాజా, చిట్యాల పోలీస్ స్టేషన్‌తో పాటు వట్టిమర్తి గ్రామ స్టేజీ వద్ద, మాల్, డిండి పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చూడాలి



హుజూర్‌నగర్‌లో అధికారులకు సూచనలిస్తున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

హుజూర్‌నగర్: ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. ఆదివారం ఆయన హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల, గరిడేపల్లి, చింతలపాలెం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను, మట్టపల్లి వద్ద అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు, హుజూర్‌నగర్‌లోని స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల కోసం మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

వారసత్వ రాజకీయాలు దేశానికే ప్రమాదం

● బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

నల్లగొండ రూరల్: వారసత్వ రాజకీయాలతో దేశానికే ప్రమాదం పొంచి ఉందని, రాహుల్ గాంధీ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి వరకు వారసత్వ రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీజేపీ గెలిచే 400 ఎంపీ స్థానాల్లో నల్లగొండకు స్థానం ఉంటుందని అన్నారు. ప్రధాని మోదీకి దేశమే కుటుంబంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ పేరు చెబితే ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రతి ఇంటికి గ్యాస్, ప్రతి గ్రామానికి రోడ్డు, వ్యవసాయ రంగానికి కేంద్రం చేయూతనిచ్చిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే మురిగిపోతుందని, బీజేపీకి ఓటేస్తే దేశం వెలిగిపోతుందన్నారు. ప్రపంచ దేశాలన్ని మోదీ పాలనను ప్రశంసిస్తున్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఇక్కడ పరిశ్రమలు స్థాపించాలని కేంద్ర మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తీసుకుంటామన్నారు. సాగర్‌లో నీరున్నా చెరువులు నింపలేదన్నారు. చెరువుల్లో మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, శ్రీదేవిరెడ్డి, పిల్లిరామరాజు, పోతేపాక సాంబయ్య, లింగస్వామి, మునికుమార్, మహేష్, భూపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బోగరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి చామల, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్: రాష్ట్రంలో మరో ఇరవై ఏళ్ల కాంగ్రెస్ పార్టీనే అధికారంలోనే ఉంటుందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీబీనగర్‌లో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టామని అన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పాపాల చిట్టా బయటకు వస్తున్నాయని, కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి జిల్లాకు నిధులు తేవడం చేతకాలేదని, కానీ కేసీఆర్‌కు మందు పోయడం తెలుసని ఎద్దేవా చేశారు. ఆగస్టు లోపు రుణమాఫీ చేస్తామని అన్నారు. ఆగమైన తెలంగాణ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

నిధుల కోసం పోరాటం చేస్తా..

తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరి ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం పార్లమెంట్‌లో పోరాటం చేస్తానని ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనన్నారు. ప్రజలు గమనించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోలి పింగళ్‌రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, వేణుగౌడ్, మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అచ్చయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు ఎప్పటికప్పుడు పంపాలి

● ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్



రామాపురం క్రాస్‌రోడ్‌లో ఆర్డీఓతో మాట్లాడుతున్న కళ్యాణ్‌కుమార్ దాస్

కోదాదరూరల్: ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఖర్చు పెడుతున్న వివరాల నివేదికను స్థానిక ఎన్నికల అధికారుల ఎప్పటికప్పుడు తయారుచేసి పంపించాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థుల ప్రచార వ్యయాలు ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నగదు, మద్యం, విలువైన వస్తువులు, మాదక ద్రవ్యాలు రాకుండా వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఇప్పటి వరకు పట్టుబడిన నగదు, ఇతర వస్తువుల వివరాలను ఆర్డీఓ సీహెచ్. సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

రాజగోపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలి

● బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

చౌటుప్పల్: ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ సవాల్ విసిరారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కొండూర్ రోడ్డులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.9వేల కోట్లతో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి ఏమిటో చూపిస్తానని, దమ్ముంటే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. 2009లో రాజగోపాల్‌రెడ్డి ఆస్తులు రూ.19కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.450కోట్లకు పెరిగాయన్నారు. తాను రూ.254 కోట్ల ఆస్తులు ప్రజల కోసం అమ్ముకున్నానని తెలిపారు. తనకు మంత్రి పదవి కావాలన్న కోరికతో కంపు రాజకీయాలకు రాజగోపాల్‌రెడ్డి తెర లేపారన్నారు. బూర నర్సయ్యగౌడ్ దెబ్బకు రాజగోపాల్‌రెడ్డి రాత్రిపూట ఇతర పార్టీల కార్యకర్తల ఇళ్లలోకి వెళ్లి వారి కాళ్లు మొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. దేశం బాగుండాలంటే మరోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అవ్వాల్సిందేనని గుర్తుచేశారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసినా దండగేనన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శాగ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలె చిరంజీవి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, కాయితి రమేష్‌గౌడ్, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, బాతరాజు సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తుతా

● సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



రామన్నపేటలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎండీ జహంగీర్

రామన్నపేట: భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళమెత్తుతానని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. ఆదివారం రామన్నపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. చట్టసభల్లో సగానికిపైగా కోటీశ్వరులు, నేరస్తులు ఉన్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి ఎన్నికలను డబ్బు మయం చేశారని ఆరోపించారు. ఇతర ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రజా సమస్యలపై కనీస అవగాహన లేదని, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎల్లలు కూడా తెలియవని ఎద్దేవా చేశారు. గతంలో ఎంపీగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్, ఒకసారి గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీలు నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని ఆరోపించారు. కార్యక్రమంలో మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, బొడ్డుపల్లి వెంకటేశం, నాగటి ఉపేందర్, బడుగు రమేష్, వనం ఉపేందర్, ఆవనగంటి వెంకటేశం, కూరెళ్ల నర్సింహాచారి, ఎర్రోళ్ల లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.16లక్షలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో నందిపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం టూటౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా దామరచర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి 140 గ్యాస్ స్టవ్‌లతో పాటు రూ.1.16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్న డబ్బులను జిల్లా ట్రెజరరీ ఆఫీసుకు తరలించినట్లు టూటౌన్ సీఐ పి. నాగార్జున తెలిపారు.

పదేళ్లుగా నిరుద్యోగ సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్

నల్లగొండ రూరల్ : పదేళ్లుగా నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తూ జైలు జీవితం గడిపానని నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20ఏళ్లుగా జర్నలిస్టుగా, చరిత్రకారుడిగా, ఉద్యమకారుడిగా అశోక అకాడమి పేరుతో నిరుద్యోగులకు ఆన్‌లైన్ పోటీ పరీక్షల సిలబస్ చెప్పి ఉద్యోగాల్లో రాణించేలా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టి చంచల్‌గూడ జైలుకు తరలించి ఇబ్బందులకు గురి చేసినా నిరుద్యోగుల గొంతుకగా నిలబడి పోరాటం చేసానన్నారు. గ్రూప్1, 2 పోటీ పరీక్షల విషయంలో, కానిస్టేబుల్ రిజర్వేషన్ల విషయంపై నిరుద్యోగుల తరఫున పోరాటం చేసినట్లు తెలిపారు. నిరుద్యోగులంతా తనకు ఓటేసి గెలిపించాలని నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలపై పోరాడతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. సమావేశంలో నరేష్, సురేష్, శ్రీనివాస్, శోభ, మంజుల, రాధిక, హైమావతి, రాణి, ముత్యం, మహేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

పెద్దలను ఎదిరించలేక ప్రేమ జంట ఆత్మహత్య

● సూసైడ్ నోట్ లభ్యం
● ఏడుగురిపై కేసు నమోదు
● తుమ్మల పెన్‌పహాడ్‌లో ఘటన



సంజయ్ (ఫైల్)



నాగజ్యోతి (ఫైల్)

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): పెద్దలను ఎదిరించలేక ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుండగాని సంజయ్, అదే గ్రామానికి చెందిన సల్లగుండ్ల నాగజ్యోతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సంజయ్ సూర్యాపేటలో ఉంటూ వాటర్ ప్లాంట్‌లో మెకానిక్‌గా పనిచేస్తుండగా.. నాగజ్యోతి బీ-ఫార్మసీ పూర్తిచేసి హైదరాబాద్‌లోని నాగోల్ క్రాస్ రోడ్‌లో గల ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేసుకుంటూ ఎం-ఫార్మసీ చదువుతోంది. తాను నాగజ్యోతిని ప్రేమిస్తున్న విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు గతంలోనే సంజయ్ తెలియజేయగా వారు వివాహానికి ఒప్పుకోలేదు. అయినప్పటికీ మూడేళ్లుగా వారు ప్రేమలోనే ఉన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు నాగజ్యోతి తల్లిదండ్రులకు లేనిపోని విషయాలు చెప్పడంతో ఆమెను తండ్రి మందలించాడు. ఉగాది పండుగ తర్వాత నుంచి ఆమెను ఉద్యోగం మాన్పించి ఇంటి దగ్గరే ఉంచాడు.

కలిసి ఉండలేమని భావించి..

తమ ప్రేమ విషయమై గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అసత్యాలు ప్రచారం చేస్తుండడంతో, ఇకపై తాము కలిసి ఉండలేమని భావించి వారిద్దరు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి సంజయ్, నాగజ్యోతి తమ తమ ఇళ్ల నుంచి బయటికి వచ్చి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగారు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా.. అంత్యక్రియలు పూర్తిచేశారు.

సూసైడ్ నోట్ లభ్యం..

తమ ప్రేమకు అడ్డంకిగా మారి ఇబ్బందులకు గురిచేసిన గ్రామానికి చెందిన బెల్లంకొండ నారాయణ, ఆరె లతారెడ్డితో పాటు నాగజ్యోతి బంధువులైన సల్లగుండ్ల అజయ్, సల్లగుండ్ల మల్లయ్య, సల్లగుండ్ల శ్రీను, సల్లగుండ్ల ఉప్పలయ్యతో పాటు నాగజ్యోతి తండ్రి సల్లగుండ్ల శ్రీనుపై చర్యలు తీసుకోవాలని వారు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న పోలీసులు



వెంకటమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా అడ్డుకుంటున్న పోలీసులు

మునగాల(కోదాడ): తమకు న్యాయం జరగడం లేదని ఓ మహిళ మునగాల పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. తమ పొలంలో బావి తవ్వించుకునేందుకు గాను ఇంట్లో దాచిన నగదును తమ కోడలు సంధ్య, ఆమె సోదరుడు రాచర్ల రాజేష్ దొంగిలించారని మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దామెర కృష్ణయ్య, వెంకటమ్మ దంపతులు గత జనవరిలో మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు కేసు నమోదు చేయకుండా తమ ఫిర్యాదును బుట్టదాఖలు చేయడమే కాకుండా తిరిగి తమపైనే అక్రమ కేసు పెట్టారని వెంకటమ్మ ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ, డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా మునగాల పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ ఆదివారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటమ్మ పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణయ్య, వెంకటమ్మ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోదాడ బీఆర్‌ఎస్ నేత, ఎన్నారై జలగం సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను కోరినట్లు తెలిపారు. జలగం ఇంటి పేరు, ఎన్నారైగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినందున ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లోని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులతో మాట్లాడి మద్దతు కోరినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

అడవిదేవులపల్లి: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి శివారులో జరిగింది. ఎస్‌ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన గువ్వల పెదసైదయ్య(55) బైక్‌పై చిట్యాల గ్రామంలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. బాల్నేపల్లి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. పక్కనే ఉన్న బండరాయి తగలడంతో తలకు బలమైన గాయాలతో పాటు కాలు విరిగింది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బాల సైదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారులున్నారు.

రైల్వే సర్వీసులు - ప్రయాణికుల ఇబ్బందులపై నేడు సదస్సు

భువనగిరి: సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ భవనంలో 'రైల్వే సర్వీసులు-ప్రయాణికుల ఇబ్బందులు' అనే అంశంపై సదస్సు జరగనుంది. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు జరిగే సదస్సుకు విద్యావంతులు, మహిళలు, రిటైర్డ్ అధికారులు, యువజన విద్యార్థి ప్రతినిధులు హాజరుకానున్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి

● ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాజీ మంత్రి ఆర్డీఆర్‌ను కలిసిన తీన్మార్ మల్లన్న

భానుపురి (సూర్యాపేట): పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఖమ్మం, వరంగల్, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) కోరారు. ఆదివారం సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మద్దతు కోరుతూ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 27న జరిగే ఎన్నికల్లో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశీస్సులతో మే 3న నల్లగొండలో నామినేషన్ వేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసిన పార్టీ బీఆర్‌ఎస్ అని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వీరేశం, నేతిని కలిసిన తీన్మార్ మల్లన్న

నకిరేకల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆదివారం పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తనకు మద్దతు తెలపాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేసిన మీలా మహదేవ్ తదితరులు

సూర్యాపేటటౌన్ : యువత క్రీడల్లో రాణించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు ఆటల పోటీలను సద్వినియోగం చేసుకొని పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అనంతరం అండర్ 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలు, మహిళా, పురుషుల విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 750మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 100మీటర్లు, 400మీటర్లు, 800, 600మీటర్లు, 5కేఎం, 3కేఎం రన్నింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గడ్డం వెంకటేశ్వర్లు, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అజంబాబా, ఉపాధ్యాయులు యాదయ్య, రవి, మైసయ్య, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోట దగ్ధం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఆయిల్ పామ్ తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన డాక్టర్ మారుపాక జనార్దన్ ఏడాది కాలంగా ఆయిల పామ్ తోట సాగు చేస్తున్నాడు. ఈ తోటలో 80 ఆయిల్ పామ్ మొక్కలను పెంచుతున్నారు. ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తోటలోని చెట్లు, డ్రిప్ పైపులు కాలిబూడిదయ్యాయి.

'ఆవిష్కర్త' సినిమా పాట విడుదల



మాట్లాడుతున్న తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు ప్రవీణ్‌కుమార్ బోగ ఆవని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన 'ఆవిష్కర్త' సినిమాలోని 'నామదే..నామదే'అనే పాటను శనివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం పైడిరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో పాటను ప్రదర్శించారు. అనంతరం మామిడి హరికృష్ణ మాట్లాడారు. ఆవిష్కర్త సినిమా ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొంది విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్శకుడు ప్రవీణకుమార్, సాత్విక, నిర్మాత రుద్ర నవీన, కెమెరామెన్ సూరెపల్లి ఉపేంద్ర, మ్యూజిక్ డైరెక్టర్ కురాకుల విజయ్, పాటల రచయిత శాకపూరి గోపీకృష్ణ, గుంటి దయానంద్, నటీనటులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ మాడవీధుల్లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రీ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధికసంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు, క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, కొండపైన, కొండ కింద బస్టాండ్, పార్కింగ్ దగ్గర భక్తులు కిటకిటలాడారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారుగా 2గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. యాదాద్రీశుడిని 4వేల మందికిపైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి రూ.59,34,193 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

నరసింహాచార్యులకు డాక్టరేట్, స్వర్ణనంది అవార్డు

నార్కట్‌పల్లి : మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన ఉత్తరపల్లి నరసింహాచార్యులకు హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గానసభలో తెలుగు సంస్కృతి సాహితీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయిలో డాక్టరేట్, స్వర్ణనంది అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్చక పౌరోహిత రంగంలో, ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాలు చేసినందుకు అవార్డు ప్రదానం చేసినట్లు వెల్లడించారు. అవార్డును సినీ ఆర్టిస్ట్ అప్పారావు, దైవాజ్ఞశర్మ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచార్యులు, అయోధ్య శ్రీరామచంద్రస్వామి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ డైరెక్టర్ మంజుల, సాహితీ సామ్రాట్ సూరేపల్లి విజయ, ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.